3న బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

కుత్బుల్లాపూర్: డిసెంబర్ 3న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు గండి మైసమ్మలోని పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వారు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ప్రణాళికతో ప్రగతినగర్ అభివృద్ధి



ప్రగతినగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: 30 ఏళ్లుగా ప్రణాళికతో ప్రగతినగర్ అభివృద్ధికి కృషి చేశామని మేడ్చల్ జిల్లా సీపీఎం కార్యదర్శి సత్యం, బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య అన్నారు. మేడ్చల్ జిల్లా సీపీఎం మూడో మహాసభల నేపథ్యంలో ప్రగతినగర్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతినగర్ ఏర్పాటు నుంచి పంచాయతీగా, ఆపై కార్పొరేషన్‌గా రూపాంతరం చెందడంలో సీపీఎం ప్రధాన భూమిక పోషించిందన్నారు. ఈ ప్రాంతానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా దేశంలోనే నంబర్‌వన్ పంచాయతీగా ప్రగతినగర్‌కు గుర్తింపు తెచ్చిన ఘనత సీపీఎంకు దక్కుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఆరుగురు సీపీఎం కార్పొరేటర్లు గెలుపొంది ఈ ప్రాంతాభివృద్ధికి మరింత కృషి చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, భవిష్యత్‌లో కూడా తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వ్యక్తులపై కేసు



సీఐ సతీశ్‌కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

దుండిగల్: వార్త సేకరణకు వెళ్లిన ఓ జర్నలిస్టుపై దాడి చేసిన వ్యక్తులపై దుండిగల్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేటకు చెందిన రాయపురి మద్దయ్య 'దిశ'లో మూడేళ్లుగా విలేకరిగా పని చేస్తున్నాడు. కాగా దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి, భౌరంపేటలో త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ నిర్మాణాలను చేపడుతోంది. వాటిని పరిశీలించేందుకు దుండిగల్ మండల రెవెన్యూ వెళ్లారు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన మద్దయ్యను కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

త్రిపుర నిర్మాణ సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిశ జిల్లా బ్యూరో రవి చందర్, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కొలిపాక వెంకట్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పీ సాయిబాబా, జర్నలిస్టులు రణదేవ్, లింగస్వామి, గుంటుపల్లి దత్తు, రాజు, రామకృష్ణ రెడ్డి, రాజేందర్, పాషా, సాయి ఉన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



తండ్రికి శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

జీడిమెట్ల: 108 అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి ఆడ శిశువు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన గర్భిణి నిషాకుమారి(24)కి పురిటినొప్పులు వస్తున్నాయని మంగళవారం ఉదయం జీడిమెట్ల 108కు కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన పైలట్ నవీన్ అక్కడికి చేరుకున్నాడు. నిషాకుమారిని ఐడీపీఎల్ నుంచి దుండిగల్ పీహెచ్‌సీకి తీసుకువెళ్తుండగా పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ స్వామి ఈఆర్‌సీపీ మనీష్ ఆన్ సూచనల మేరకు 108 సిబ్బంది పురుడు పోశారు. నిషాకుమారి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని దుండిగల్ వైద్యాధికారిని తెలిపింది.

హెచ్‌ఎంల సమస్యల పరిష్కారానికి కృషి



రామ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వృత్తిపరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామ్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను భౌరంపేటలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చొరవ తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్ రెడ్డి, పద్మప్రియ, ప్రేమ్ కుమార్, నాగమణి, గౌడ్ భాస్కర్, జయంతి, ధన్‌రాజ్, రాజు, లక్ష్మీనరసమ్మ, వెంకటనారాయణ, సదాలక్ష్మి, గీత, విజయలక్ష్మి , అశ్విని, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జీడిమెట్ల: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్ డిపో ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికుల స్వేచ్ఛను హరించేలా 2019లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంఘాలపై ఆంక్షలు విధించిందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని డిపోల మేనేజర్లు ఏకపక్షంగా వ్యవహరిస్తూ డ్యూటీల విషయంలో డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మహిళా సిబ్బందికి సైతం రాత్రి 11 గంటల వరకు విధులు అప్పగించడం సరైన పద్ధతి కాదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంఘాల ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆంక్షలను తొలగించి వెంటనే యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రావుల స్వాతి, శీను మల్లారెడ్డి, ఆంజనేయులు, యాదవరెడ్డి, తిమ్మప్ప, వీరేశ్, దుర్గానాయక్, మల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

నియోజకవర్గవ్యాప్తంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉక్కు మహిళగా దేశ అభివృద్ధికి ఇందిరాగాంధీ అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

– కుత్బుల్లాపూర్



షాపూర్‌నగర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కొంపల్లిలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్.



బాచుపల్లిలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి..

ఆలయంలో ప్రత్యేక పూజలు



కలశాలు తీసుకువస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని సీతారామచంద్రస్వామి శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి రాజ గోపుర కలశ స్థాపన సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రాజగోపుర శిఖర కలశస్థాపన ఉంటుందని, ఆలయ కమిటీ పేర్కొంది. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

మర్యాదపూర్వక కలయిక



గోపాల్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న స్వాములు

నిజాంపేట్: నిజాంపేట్‌కు చెందిన సాయి తిరుమల డిజిటల్స్ అధినేత విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షాపరులు కాంగ్రెస్ సీనియర్ నేత కొలన్ గోపాల్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించనున్న అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జగద్గిరిగుట్ట: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని మెట్లపై ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి వయస్సు 50–55 మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు.

ఇల్లు అద్దెకు ఇస్తానని మోసం



శివశంకర్

నిజాంపేట్: యాప్‌లో ఇల్లు అద్దెకు ఇస్తానని నమ్మించి పలువురిని మోసగించిన వ్యక్తిని బాచుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ బండారి లేఅవుట్‌కు చెందిన పట్నం శివశంకర్ సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో పాండురంగ ఆర్కేడ్‌లోని ఫ్లాట్ నంబర్ 304ను అద్దెకు ఇస్తానని 99 ఎకర్స్ యాప్‌లో ఆగస్టులో యాడ్ ఇచ్చాడు. ఈ క్రమంలో భార్య మాధవి, అల్లుడు లోకేశ్‌తో కలిసి 17 మంది నుంచి ఇంటి అద్దె అడ్వాన్స్‌లుగా రూ.5 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు మంగళవారం నిందితుడు శివశంకర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారని పోలీసులు పేర్కొన్నారు.

పారిశ్రామికవాడలో వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ధూలపల్లి ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (దివ) సభ్యులు ఆయనను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిమెట్ల-ధూలపల్లి పారిశ్రామికవాడ ప్రధాన రోడ్లతో పాటు అప్రోచ్ రోడ్లను నిర్మించాలని, అదేవిధంగా ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ పదేళ్లలోనే వేలాది కోట్ల రూపాయలతో పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా మరికొన్ని ఏర్పాటు చేయించి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ధూలపల్లి పారిశ్రామికవాడలోని రోడ్ల నిర్మాణంతో పాటు వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణం, మౌలిక వసతులైన తాగునీటి సౌకర్యం, పార్కుల అభివృద్ధికి కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి వెంకటేశ్వర్ రావు, సభ్యులు ఇక్బాల్, శివ సుందర్, శశికాంత్, మేఘనాథ్ రెడ్డి, మూర్తి, శంకర్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పత్రం అందజేత..

కుత్బుల్లాపూర్ డివిజన్ వాజ్‌పేయ్‌నగర్‌కు చెందిన ఎస్. హర్షిణి అనే చిన్నారి (11)కి వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. సంబంధిత రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీనివాస కాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, జయభేరి బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ జీపీఆర్ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాచుపల్లి ఏఈ తెలిపారు. 11కేవీ జీపీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జీపీఆర్ కాలనీ, ఐడీపీఎల్ కాలనీల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

33/11 కేవీ హెచ్‌ఎంటీ సబ్ స్టేషన్ పరిధిలో..

చింతల్: ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సీబీడీ బోయిన్‌పల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. 33/11 కేవీ హెచ్‌ఎంటీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీ సాయి కాలనీ ఫీడర్ పరిధిలో భారతినగర్, గాంధీనగర్, ఉదయం 10 నుంచి 5 గంటల వరకు చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌ఎంటీ మెయిన్ రోడ్, అయ్యప్ప స్వామి టెంపుల్ లైన్, ద్వారకాపురి కాలనీ, సీఎంఆర్ షాపింగ్ మాల్, హెచ్‌ఎంటీ కాలనీ, హెచ్‌ఎంటీ కంపెనీ, హెచ్‌ఎంటీ మెయిన్ రోడ్ తదితర ఫీడర్ల పరిధిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నార్త్ సిటీ పాఠశాలలో జాతీయ సమైక్యత దినోత్సవం



వివిధ రాష్ట్రాల ప్రజల వేషధారణలో నార్త్ సిటీ స్కూల్ విద్యార్థులు

సుభాష్‌నగర్: సూరారంలోని నార్త్ సిటీ పాఠశాలలో మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు 28 రాష్ట్రాల సాంప్రదాయ వేషధారణలో దేశ సమైక్యత సంస్కృతిని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్‌ముదిరాజ్ మాట్లాడుతూ భారతదేశం భిన్న సంస్కృతులకు నిలయమని, ప్రేమ ఐక్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు దేశభక్తిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

అవార్డు రావడం ఆనందంగా ఉంది



అవార్డు అందుకుంటున్న పద్మలతారెడ్డి

జీడిమెట్ల: జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పురస్కారం అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మలతారెడ్డి అన్నారు. ఫౌండేషన్ ద్వారా పద్మలతారెడ్డి సుభాష్‌నగర్‌లో అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యావసతిని అందిస్తున్నారు. ఇందుకు గాను ఆమెకు జవహర్‌లాల్‌నెహ్రూ బర్త్‌డేను పురస్కరించుకుని మనం ఫౌండేషన్ వారు నెహ్రూ జాతీయ పురస్కారం అందజేశారు. ఆమెతో పాటు ఫౌండేషన్ ద్వారా చదువుకుంటున్న ఎస్.అఖిల్, ఎస్.లాస్యకు నెహ్రూ నేషనల్ అవార్డును అందజేశారు.

ప్రజా శ్రేయస్సుకే సమగ్ర సర్వే



పరిశీలిస్తున్న స్పెషల్ అధికారి మయాంక్ మిట్టల్, ఉప కమిషనర్

చింతల్: పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిందని గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి అన్నారు. భగత్‌సింగ్‌నగర్‌లో కొనసాగుతున్న సర్వేను స్పెషల్ ఆఫీసర్ మయాంక్ మిట్టల్‌తో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో భద్రపరిచిన సర్వే పత్రాలను పరిశీలించారు. అలాగే ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీ హరిప్రియ, నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు



పరీక్ష ఫీజులు చెల్లిస్తున్న విజయ్‌కుమార్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సింగిల్ పేరెంట్ విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ఫీజులు చెల్లించారు. సాయి సంజీవని మెడికల్ దుకాణం యజమాని శ్రీనివాస్ అందించిన ఆర్థిక సాయంతో 23 మంది విద్యార్థులకు చెందిన ఫీజులు చెల్లించామని సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్స్



లికితగౌడ్‌ను అభినందిస్తున్న దీక్ష స్కూల్ చైర్మన్ శివయ్య

కుత్బుల్లాపూర్: రాష్ట్రస్థాయి ఫిన్‌స్విమ్ పోటీల్లో కుత్బుల్లాపూర్ దీక్ష స్కూల్ విద్యార్థిని ప్రతిభ చూపింది. దుండిగల్ మున్సిపల్ భౌరంపేట్‌లోని బ్లూవేవ్ స్విమ్ అకాడమీలో జరిగిన స్టేట్ లెవెల్ పోటీల్లో లికితగౌడ్ 50, 100, 200, 400 మీటర్ల బైఫిన్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించింది. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ శివయ్య ఆమెకు మెడల్స్, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లికితగౌడ్‌కు శిక్షణ ఇచ్చి రాణించడంలో కోచ్ విజయ్‌సింగ్ కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరేశలింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029